# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 14-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- మహిళలు నిర్భయంగా ఉంటూ ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.
- ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు భారత్ అమెరికా దేశాలు కట్టుబడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు దేశ వ్యాప్తంగా ప్రజలు నివాళులు అర్పించారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23న ప్రసారం కానుంది.

=======================

మహిళలు తమ కలలను సాకారం చేసుకోవడానికి ధైర్యం, బలం, సామర్థ్యాన్ని కలిగి ఉండాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషనల్ సెంటర్ నిర్వహించిన 10వ అంతర్జాతీయ మహిళా సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... మహిళలు నిర్భయంగా ఉండాలని, ప్రతిష్టాత్మక లక్ష్యాలను నిర్దేశించుకోవాలని అన్నారు. కుటుంబ, సమాజ శ్రేయస్సుకు మానసిక ఆరోగ్యం ప్రధానమైందని, దీనిని ప్రతి మహిళా కలిగి ఉండాలని రాష్ట్రపతి సూచిస్తు..

(వాయిస్ 39 సెకన్లు)

=======================

భారత్ - అమెరికా దేశాల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఈరోజు వాషింగ్టన్ లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం సంయుక్తంగా జరిపిన విలేకరుల సమావేశంలో నరేంద్ర మోదీ మాట్లాడుతూ..

భారత్ - అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకు వేళతామని అన్నారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయన్నారు. ప్రపంచంలోని ప్రాచీన, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన అమెరికా - భారతదేశాల మధ్య ప్రత్యేక బంధం ఉందని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. భారతదేశానికి చమురు, సహజ వాయువు సరఫరాలో అమెరికా అగ్రగామిగా ఉండేలా ఇంధన ఒప్పందాన్ని రెండు దేశాలు కుదుర్చుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

======================

పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నివాళులు అర్పించారు. పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన సైనికుల త్యాగాన్ని, దేశం పట్ల వారి అచంచల అంకితభావాన్ని రాబోయే తరాలు ఎప్పటికీ మరచిపోవని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువు అని, దీనిని ప్రపంచం మొత్తం వ్యతిరేకిస్తుందని కేంద్రమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఫిబ్రవరి 14, 2019లో జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామాలో ఉగ్రవాదులు చేసిన దాడిలో 40 మంది CRPF సిబ్బంది అమరులయ్యారు. కాగా ప్రతి సంవత్సరం ఉగ్రవాద వ్యతిరేక పోరాటాన్ని తలచుకుంటూ, వీర సైనికులకు నివాళులు అర్పించడానికి ఈరోజును 'బ్లాక్ డే'గా జరుపుకుంటారు.

======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 21వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

విరామం

======================

ఇండియా ఎనర్జీ వీక్ కార్యక్రమం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఇంధన వేదికగా నిలిచిందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఇండియా ఎనర్జీ వీక్ ముగింపు సమావేశంలో ఈరోజు కేంద్రమంత్రి మాట్లాడుతూ.... ఈ కార్యక్రమం నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్‌గా కాకుండా వాస్తవ వ్యాపార లావాదేవీలను సులభతరం చేయడంలో ప్రత్యేకతను చాటిందన్నారు. ఇండియా ఎనర్జీ వీక్ తదుపరి సంచిక గోవాలో జరగనుందని తెలిపారు. పెట్రోలియం, సహజ వాయువు, గ్రీన్ ఎనర్జీ, బయో ఇంధనం వంటి సమగ్ర రంగాలను కలుపుకుని అంచనాలను మించి, అసాధారణమైన వినూత్న పరిణామాలను ప్రదర్శించిందని కేంద్ర మంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 32 సెకన్లు)

======================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆది మహోత్సవ్ 2025ను ఈనెల 16వ తేదీన ప్రారంభించనున్నారు. గిరిజనుల వ్యవస్థాపక స్ఫూర్తి, చేతి పనులు, సంస్కృతి, వంటకాలు, వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తూ... న్యూఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో 9 రోజుల పాటు దీనిని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల సహాయ మంత్రి దుర్గాదాస్ యూయికే ఈరోజు ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన గిరిజన

కళాకారులు, వ్యవస్థాపకులు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి ఇది ఒక వేదిక అన్నారు. ఈ కార్యక్రమం 600 మందికి పైగా గిరిజన వ్యవస్థాపకులను ఒకచోట చేర్చుతుందని తెలిపారు. దేశంలో ఐక్యత, వైవిధ్యాన్ని పెంపొందించడంలో ఒక పునాదిరాయిగా నిలిచే వివిధ సాంస్కృతిక, సాంప్రదాయ కార్యక్రమాలు ఈ కార్యక్రమంలో ఉంటాయని తెలిపారు.

======================

భారత్, థాయిలాండ్ దేశాలు 2 వేల సంవత్సరాలకు పైగా లోతైన సాంస్కృతిక సంబంధాలను పంచుకుంటున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. థాయిలాండ్‌లో నిర్వహిస్తున్న సంవాద్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానమంత్రి దృశ్య మాధ్యమం ద్వారా ప్రసంగిస్తూ... భారతదేశ యాక్ట్ ఈస్ట్ పాలసీ, థాయిలాండ్ యాక్ట్ వెస్ట్ పాలసీ అనేవి ఇరు దేశాల పరస్పర పురోగతి, శ్రేయస్సును ప్రోత్సహిస్తాయని అన్నారు. ఈ సమావేశం ద్వారా ఇరు దేశాల మధ్య స్నేహానికి మరో విజయవంతమైన ప్రారంభమవుతుందని అన్నారు. థాయిలాండ్ గొప్ప సంస్కృతి, చరిత్ర, వారసత్వాన్ని కలిగి ఉందని, ఆసియా ఉమ్మడి తాత్విక, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ఇది ఒక అందమైన ఉదాహరణగా నిలుస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

======================

ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతోన్న మహా కుంభమేళాలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానలు ఆచారిస్తున్నారు. ఈరోజు ఒక్కరోజే సాయంత్రం 6 గంటల వరకు 92 లక్షల మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారని, దీంతో ఇప్పటివరకు వచ్చినవారి సంఖ్య 50 కోట్లు దాటిందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. మానవ చరిత్రలో ఏ మతపరమైన, సాంస్కృతిక లేదా సామాజిక కార్యక్రమంలో ఈ స్థాయిలో జనం పాల్గొనలేదని తెలిపింది. జనవరి 13న మొదలైన ఈ ఆధ్యాత్మిక వేడుక ఈనెల 26వ తేదీ వరకు కొనసాగనుంది. రాబోయే 12 రోజుల్లో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

======================

రష్యాతో శాంతి చర్చల్లో ఉక్రెయిన్ పాల్గొంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా, రష్యా అధికారులు ఈరోజు జర్మనీలోని మ్యూనిచ్‌లో సమావేశం అవుతారని, ఈ భద్రత సమావేశానికి ఉక్రెయిన్‌ను కూడా ఆహ్వానించామని ట్రంప్ తెలిపారు. ఉక్రెయిన్‌లో సుమారు మూడేళ్లుగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో ఈ చర్చలు జరగనున్నాయని, ఈ వివాదాన్ని పరిష్కరించడానికి సాహసోపేతమైన దౌత్యం ఎంతో అవసరమని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పేర్కొన్నారు.

======================

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రేపు జమ్మూలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి కత్రాలోని మాతృకా ఆడిటోరియం SMVDU క్యాంపస్‌లో శ్రీ మాతా వైష్ణో దేవి విశ్వవిద్యాలయం 10వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి రియాసి జిల్లాలోని త్రికుట కొండలపై ఉన్న మాతా వైష్ణో దేవి మందిరం, బైరోన్ ఆలయాన్ని కూడా సందర్శించనున్నారు.

======================
======================